

# ముందు పనసకాయ యిలా లేదు

యింతకు మునుపు కాలంలో పనసకాయ యిలా వుండేదిగాదంట. వొళ్లు గరగరమని అనేది కాదంట. లోపల పీచు పీచు వుండేది గాదంట. యిట్లా వొలిస్తే అట్లా సులభంగా తొనలు బయటపడేవంట.

అయితే కాలం ఎల్లకాలం ఒకేలాగా ఉండదు కావున ఒకసారి పనసచెట్టుకి ఒళ్లు కొవ్వెక్కింది. కొవ్వెక్కి పక్కనే ఉన్న అనాస చెట్టుతో 'ఒసే అనాసా? పండ్లల్లో రాజెవరే?' అని అడిగింది.

'యింకెవరకా? మన మామిడిపండు గదా' అంది అనాస.

'చచ్చు. నోర్మూయ్. నేనెక్కడ? ఆ మామిడి చెట్టు ఎక్కడ? దాని పండు యింత బుల్లిది. నా పండేమో యింత పెద్దది. లోకంలో నన్ను మించినంత పండు యింకెక్కడుంది? అందుకని నేనే గదా రాజుని' అంది పనస.

'అట్లెట్ల రాజువవుతావకా? మామిడిపండు రుచి నీకెక్కడిది? నీది నాలిక మీద రుచే. నాలుక దాటితే అంగిటలో నీ రుచి నిలవదు. మామిడిపండు కత అలా కాదు. నోరు నాలుకా గొంతూ చిగుళ్లూ అన్నీ దాని రుచిలో తడిసిపోతాయి. అమృతంగదా అది' అంది అనాస.

ఆ మాటలకి పనసచెట్టుకి కోపం వచ్చేసింది. 'వేలెడంత లేవు. నన్ను అనేంత మొనగత్తెవి అయ్యావా' అని కాలెత్తి అనాస చెట్టుని తొక్కడం మొదలుపెట్టింది.

అనాస చెట్టుకి ఒకే పండు. అది ఒకే చెట్టు. దానిది ఒకే బిడ్డ. అందుకుని అది లబలబలాడిపోయింది. 'ఓయమ్మో. ఓరినాయనో. పనస చెట్టు నా బిడ్డని చంపేస్తా ఉంది. అల్లా రక్షించు. మౌలా రక్షించు' అని ఏడ్చింది.

అప్పటివరకూ అనాస పండుకి ముళ్లతురాయి లేదు. దాని ఏడుపుకీ, ప్రార్థనలకీ దైవికంగా ముళ్లతురాయి మొలుచుకొచ్చి పనసచెట్టు కాల్లో గుచ్చుకుంది. అబ్బా అని దూరం జరిగింది పనసచెట్టు. ఇదే సందని అడివంతా తిరిగి అన్ని పండ్ల చెట్లనీ పోగేసింది అనాస చెట్టు. చెట్లన్నీ కొలువుదీరాయి. పండ్లకు రాజైన మామిడిచెట్టు వచ్చింది. మంత్రయిన కమలా చెట్టు వచ్చింది.

'ఏమిటి సంగతి?' అని అడిగింది మామిడిచెట్టు.

'జహాపనా. పనసచెట్టుకి వొళ్లు కొవ్వెక్కింది. పండ్లన్నింటిలో పెద్దదిగా వుండటం వల్ల అదే రాజని విర్రవీగితా ఉంది. కాదు, మా పాదుషా మీరే అని నేను అన్నందుకు నా బిడ్డను చంపడానికి వచ్చింది' అని చెప్పింది అనాస చెట్టు.

'నేనేం తప్పు మాట్లాడలేదు. నా పండు పెద్దది. అందువల్ల నేనే రాజుని' అంది పనస చెట్టు.

'అవును. పనస చెప్పిన మాట కరెక్టే. నా ఓటు పనసకే' అంది నారింజ చెట్టు. ఎలక్షన్లు జరిగాయి.

ఒక్క నారింజ తప్ప తక్కిన చెట్లన్నీ 'మా రాజు మామిడి. మా మంత్రి కమలా' అని వీటి పక్షాన ఓటేశాయి. వేసి, 'జహాపనా. మీ మీద తిరుగుబాటు చేసినందుకు పనసచెట్టుకి శిక్ష విధించండి' అన్నాయి మామిడి చెట్టుతో.

అప్పుడు మామిడి చెట్టు - 'సరే. ఏ కాయనైతే చూసుకొని అది మిడిసి పడిందో యివాళ్టి నుంచి ఆ కాయకు ఒళ్లంతా గరగరమని ముళ్లు



మొలుస్తాయి. లోపల పీచు మొలచి తొనల్ని అల్లుకుంటుంది. మన పండ్లని తిన్నంత సులువుగా అక్షులు పక్షులు దీని పండుని తినలేనంత కఠినంగా యిది తయారవుతుంది. జంతువులు దీన్ని ముట్టవు. మనుషులు దీనిని కత్తులతో పొడిచి పొడిచి లోపలంతా చీరి చీరి హింసించి హింసించి దీని తొనలను బయటకు తీస్తారు. ఆ హింస యిది పడాల్సిందే. అంతేకాదు. బయటపారేసిన దీని తొక్కల మీద పందులు పొర్లాడుతాయి. ఇది నా శిక్ష' అని శిక్ష విధించింది పనస చెట్టుకి.

మరి తగుదునమ్మా అని నారింజ చెట్టు వంతపాడింది గదా. అందుకని 'పనసకి వంత పాడినందుకు యివాళ్టి నుంచి నీ వళ్లంతా పులుపే పో. నువ్వు దేనికీ పనికిరావుపో' అని దానికీ శిక్ష విధించింది మామిడి చెట్టు.

అప్పటినుంచి అది ఆ గతినా, ఇది ఈ గతినా బతుకు లాగుతున్నాయి. అనాసచెట్టు మాత్రం అప్పుడు మొలచిన ముళ్ల తురాయితో యిప్పటికీ తక్కిన చెట్ల నుంచి భయం లేకుండా హాయిగా బతుకుతూ వుంది.